ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 జయశంకర్ భూపాలపల్లి

మంగళవారం 4 నవంబరు 2025

బుగులోని జాతరకు సర్వం సిద్ధం

- నేటి నుంచి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

6వ పేజీలో..

ఇసుకాసుర!



గోదావరిలో అడ్డగోలుగా ఇసుక దందా

- టెండర్‌లో క్వారీ ఒక చోట.. తవ్వేది ఇంకోచోట
- మూసేసిన క్వారీలో మళ్లీ తవ్వకాలు
- లోడింగ్ చార్జీ పేరుతో లారీకి రూ.5వేలు వసూళ్లు
- ఒక్కో క్వారీలో రోజుకు రూ.10లక్షలకు పైగా వసూళ్లు
- టీఎస్ఎండీసీ నిర్వాకంతో వందల కోట్లు అక్రమార్కుల జేబుల్లోకి
- ములుగు ఏజెన్సీలో చక్రం తిప్పుతున్న అధికారపార్టీ నేత

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

ఇసుక తవ్వకాల్లో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. టెండర్లు వేసిన ఇసుక క్వారీల్లో కాకుండా, మరో క్వారీలో ఇసుక తవ్వుతూ కాంట్రాక్టర్లు అక్రమాలకు తెర లేపుతున్నారు. తమకు కేటాయించిన క్వారీల్లో ఇసుక నిల్వలు లేవని, మరో క్వారీ నుంచి ఇసుకను తవ్వుకునేందుకు అనుమతి ఇవ్వాలని కాంట్రాక్టర్లు అడిగిందే తడవుగా టీఎస్ఎండీసీ అధికారులు అనధికారికంగా అప్పనంగా అనుతులు ఇస్తుండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే అదనపు బకెట్, బల్క్ సరఫరాతో క్వారీల్లోని ఇసుకను ఖాళీ చేసిన ఇసుకాసురులు మళ్లీ కొత్త క్వారీలను ఆక్రమించుకుంటున్నారనే ప్రచారం జరుగుతోంది. ములుగు, భూపాలపల్లి జిల్లాలోని ఇసుక క్వారీల్లో సుమారు రూ.200 కోట్లకు పైగా విలువైన ఇసుకను అక్రమార్కులు దోచుకుంటున్నారనే టాక్ వినబడుతోంది.

తవ్వుకున్నోళ్లకు తవ్వుకున్నంతా..

ప్రభుత్వం మారినా ఇసుకాసురుల అక్రమ దందాకు మాత్రం చెక్ పడడం లేదనే ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వం నిబంధనలను తుంగలో తొక్కి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణాకు దిగుతున్నారు. ములుగు జిల్లాలో 10 ఇసుక క్వారీలు, భూపాలపల్లి జిల్లాలో ఐదు ఇసుక క్వారీలు ఉన్నాయి. అయితే ఇసుక క్వారీల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి.. అక్రమ మార్గాన ఇసుకను తరలించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కేటాయించిన క్వారీలో కాకుండా మరో క్వారీలో ఇసుకను తవ్వుతూ సొమ్ము చేసుకుంటున్నారు. ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో బోదపూర్-2 ఇసుక క్వారీలో సుమారు 1.20 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక నిల్వలు ఉన్నాయి. పక్కనే ఉన్న రామన్నగూడెం ఇసుక క్వారీలో ఉన్న లక్ష క్యూబిక్ మీటర్ల ఇసుక దాదాపు విక్రయించారు. అయితే బోదాపూర్-2 క్వారీకి కేటాయించిన ఇసుక లారీలకు రామన్నగూడెం వద్ద ఇసుకను తరలిస్తున్నారు. బోదాపూర్-2 వే బిల్లులతో వచ్చే లారీలకు రామన్నగూడెం క్వారీ వద్ద ఇసుకను లోడ్ చేయడం ఏమిటని స్థానికులు ఆదివారం ఆందోళనకు దిగారు. ప్రభుత్వం నిర్దేశించిన ఇసుక క్వాంటిటీ రామన్నగూడెం వద్ద పూర్తి కావడంతో అక్రమంగా బోదాపూర్-2 క్వారీ వే బిల్లులకు ఇసుకను తరలిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన ఓ కీలక నాయకుడు అండదండలతో అక్రమ ఇసుక దందాకు దిగుతున్నారనే (మిగతా 7లో..)

మహదేవపూర్ క్వారీ వద్ద ఇసుక డంపింగ్ (ఫైల్)



లారీకి బోదాపూర్-2 క్వారీ వద్ద ఇసుక కేటాయించిన టీఎస్ఎండీసీ వే బిల్లు

లోడింగ్ పేరుతో రూ.200కోట్లు స్వాహా..?

ఇసుకాసురుల అక్రమ దందాకు అంతు లేకుండా పోతుంది. అదనపు బకెట్, బల్క్ ఇసుక దందాకు అలవాటు పడిన అక్రమార్కులు లోడింగ్ చార్జీ పేరుతో భారీగా వసూళ్లకు దిగుతున్నారనే ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వం ఒక మెట్రిక్ టన్నుకు రూ.375 వసూలు చేస్తుంది. 5 శాతం జీఎస్టీతో పాటు రోడ్డు డ్యామేజీ మెయింటనెన్స్ పేరుతో లారీకి రూ.300 వసూలు చేస్తుంది. 16 టైర్ల లారీలో 35 మెట్రిక్ టన్నుల ఇసుకకు రూ.13,500 వరకు ప్రభుత్వానికి డీడీ రూపంలో ఇసుక కొనుగోలుదారులు చెల్లిస్తారు. ఈ మొత్తానికే లారీలో ఇసుక నింపి పంపించాల్సి ఉంటుంది. అయితే ఇసుకాసురులు అక్రమ దందాకు దిగుతున్నారు. ఇసుక లోడింగ్ పేరుతో ఒక్కొక్క లారీ రూ.5 వేలు వసూలు చేస్తున్నారు. అలాగే కాంటా పేరుతో లారీ రూ.200లు వసూళ్లు చేస్తున్నారు. ప్రతిరోజూ ములుగు జిల్లాలో ఒక్కొక్క క్వారీకి 100 నుంచి 250 లారీల వరకు ఇసుక తీసుకెళ్లేందుకు లారీలు వస్తున్నాయి. సుమారు 200 లారీలకు లెక్కేసుకున్నా.. లారీకి రూ.5 వేల చొప్పున రోజుకు రూ.10 లక్షల అక్రమ సంపాదన ఇసుకాసురుల జేబుల్లోకి చేరుతుందనే ప్రచారం జరుగుతోంది. ములుగు, భూపాలపల్లి జిల్లాలో ఇసుకకు డిమాండ్ ఉన్న సమయంలో ప్రతి రోజూ కోటి రూపాయలకు పైగా లోడింగ్ చార్జీల పేరుతో వసూళ్లకు దిగుతున్నారనే చర్చ జరుగుతోంది. ఈ ఏడాది లోడింగ్ చార్జీల పేరుతో సుమారు రూ.200 కోట్లకు పైగా అక్రమార్కులు దోచుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బోదాపూర్-2 క్వారీ వే బిల్లు లారీకి రామన్నగూడెం క్వారీ వద్ద ఇసుక లోడింగ్



రెండు మద్యం దుకాణాలకు డ్రా



డ్రా తీస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

కృష్ణకాలనీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి ఎక్సైజ్ పరిధిలోని రెండు మద్యం దుకాణాలకు సోమవారం డ్రా నిర్వహించారు. గత నెల 27 నాడే మొత్తం షాపులకు డ్రా నిర్వహించగా ములుగు జిల్లాలోని చల్వాయి, గోవిందరావుపేట దుకాణాలకు నిలిపివేశారు. ఈ రెండు దుకాణాలకు అప్పట్లో మూడు చొప్పున మాత్రమే దరఖాస్తులు దాఖలయ్యాయి. నిబంధన ప్రకారం పదికి తక్కువ కాకుండా దరఖాస్తులు వస్తేనే డ్రా నిర్వహించాలి. ఆ మేరకు దరఖాస్తులు రాకపోవడంతో గత నెల 27న ఈ రెండు దుకాణాలకు డ్రా తీయలేదు. తిరిగి 28వ తేదీ నుంచి కొత్తగా దరఖాస్తులను ఆహ్వానించారు. ఈ క్రమంలో చల్వాయికి 23, గోవిందరావుపేటకు 50 మంది దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఈ రెండు దుకాణాలకు భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ చేతుల మీదుగా సోమవారం డ్రా నిర్వహించారు. చల్వాయి దుకాణం సదర్‌లాల్‌కు, గోవిందరావుపేట దుకాణం సమ్మక్కకు దక్కాయి. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ వేముల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఐటీడీఏను ముట్టడించిన ఆదివాసీలు

- లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్
- కార్యాలయం లోపలికి వెళ్లేందుకు యత్నం
- అడ్డుకున్న పోలీసులు.. ఉద్రిక్తత





ఐటీడీఏ ముట్టడికి ర్యాలీగా వస్తున్న ఆదివాసీలు, కార్యాలయం లోపలికి రాకుండా గేట్ వద్ద అడ్డుకుంటున్న పోలీసులు

ఏటూరునాగారం రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసులు కదం తొక్కారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ములుగు జిల్లా ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయాన్ని సోమవారం ముట్టడించారు. ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చిన ఆదివాసీలు మండల కేంద్రంలోని వై-జంక్షన్ వద్ద కుమరం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి ర్యాలీగా బయల్దేరి ఐటీడీఏ కార్యాలయం వద్ద జాతీయ రహదారిపై ధర్నా చేశారు. కార్యాలయం గేట్లు తోసుకుంటూ లోపలికి వెళ్లేందుకు యత్నించగా వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, ఆదివాసీల మధ్య తోపులాట జరిగి, ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తమ లోపలికి వెళ్లేందుకు అనుమతించాలంటూ ఆదివాసీలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పరిస్థితి అదుపు తప్పే పరిస్థితి ఉండటంతో ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా ధర్నా చేస్తున్న వారి దగ్గరకు వచ్చి వినతి పత్రాన్ని తీసుకున్నారు. ప్రభుత్వం, కలెక్టర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తానని హామీనివ్వడంతో ఆదివాసీలు శాంతించారు.

పోలీసుల భారీ బందోబస్తు

ఆదివాసీ జేఏసీ చేపట్టిన ఐటీడీఏ ముట్టడి కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఏఎస్పీ శివం ఉపాధ్యాయ స్వయంగా పరిస్థితిని పరిశీలించారు. ఏటూరునాగారం, వెంకటాపురం, పస్రా సీఐలతో పాటు ఆరు మండలాల ఎస్సైలతో బందోబస్తు నిర్వహించారు. ఐటీడీఏను పోలీసుల వలయంలోకి తీసుకున్నారు. జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వాహనాలను మరో మార్గంలో మళ్లించారు.

మా హక్కులకు విఘాతం: జేఏసీ చైర్మన్

దొడ్డిదారిన ఎస్టీ జాబితాలోకి వచ్చిన లంబాడీలు ఆదివాసుల హక్కులను కాలరాస్తున్నారని ఆదివాసీ జాయింట్ యాక్షన్ చైర్మన్ పూనెం శ్రీనివాస్ విమర్శించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 342(1),(2)ప్రకారం షెడ్యూల్డ్ తెగల జాబితాను ప్రకటించడం, సవరించడం రాష్ట్ర ప్రభుత్వ సిఫార్సులు, ట్రైబల్ అడ్వైజరీ కమిటీ అభిప్రాయం, పార్లమెంట్ చర్చలు, రాష్ట్ర అసెంబ్లీ తీర్మానాల ఆధారంగా మాత్రమే జరగాలన్నారు. కానీ, 1976లో ఆర్టికల్ 342సబ్ క్లాస్(2)కు విరుద్ధంగా ఎలాంటి నిబంధనలు పాటించకుండా లంబాడా, బంజారాలను అమైన్మెంట్ యాక్ట్ 1081976లో గెజిట్ విడుదల చేయడం దారుణమన్నారు. లంబాడీలను ఎస్టీ జాబితాలో చేర్చడం వల్ల ఆదివాసీలకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. లంబాడీలను ఎస్టీ జాబితాలోంచి తొలగించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. ఇదే క్రమంలో ఉట్నూర్, భద్రాచలం, మన్ననూర్ ఐటీడీఏ వద్ద ఆందోళన కార్యక్రమాలను నిర్వహించనున్నామని తెలిపారు. తమ పోరాటాలకు ఆదివాసీ ఎమ్మెల్యేలు, ఎంపీలు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ గౌరవ సలహాదారులు చందా లింగయ్య దొర, వీరయ్య, దాట్ల నాగేశ్వరరావు, గొప్ప వీరయ్య, లక్ష్మయ్య, శరత్, వైస్ చైర్మన్ వట్టం ఉపేందర్, నాయకులు ఊకే రవి, పోడెం బాబు, కబ్బాక శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి



లింగయ్య (ఫైల్)

కాటారం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో రైతు మృతి చెందిన సంఘటన భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాస్, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. కాటారం మండలం శంకరంపల్లికి చెందిన బోనగిరి లింగయ్య (66) సింగరేణిలో పనిచేస్తూ ఆరేళ్ల క్రితం రిటైరయ్యాడు. అప్పటి నుంచి తనకున్న భూమిలో భార్య, కుమారులతో కలిసి వ్యవసాయం చేస్తున్నాడు. ఈ క్రమంలో శంకరంపల్లి స్టేజీ సమీపంలో కాటారం-మంథని రహదారి పక్కనే ఉన్న చేనులో కూలీలు పత్తి తీయగా రెండు బస్తాలను స్కూటీపై పెట్టుకొని ఇంటికి బయల్దేరాడు. శంకరంపల్లి స్టేజీ (మిగతా 8వ పేజీలో)

సంక్షేమం మిథ్య!

- ప్రభుత్వ హాస్టళ్లల్లో అరకొర సౌకర్యాలు
- అనేక సమస్యలతో సతమతమవుతున్న విద్యార్థులు
- సరైన వసతి లేక తప్పని అవస్థలు
- దృష్టిసారించని ఉన్నతాధికారులు



కాల్వపల్లిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో తరగతి గదిలో పగిలి ఉన్న బండలు



తాడ్వాయి మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో తలుపు లేని విద్యార్థులు నిద్రించే గది

ములుగు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టళ్లు సమస్యల లోగిళ్లుగా మారాయి. ప్రభుత్వం ఏటా కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నా వసతి గృహాల స్థితిగతులు మారడం లేదు. అరకొర సౌకర్యాల నడుమ విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పలు వసతి గృహాలు శిథిలావస్థకు చేరగా, మరికొన్ని అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. పలు చోట్ల విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందడం లేదనే విమర్శలు వస్తున్నాయి. మరికొన్ని హాస్టళ్లల్లో వైద్య సౌకర్యాలు తూతూమంత్రంగా అందుతున్నాయని తెలుస్తోంది. ఎనిమిది నెలలుగా కాస్మొటిక్ బిల్లులు రావడం లేదు. మూడేళ్లుగా ట్రంకు పెట్టెలు, దుప్పట్లు ఇవ్వడం లేదని పలు హాస్టళ్ల విద్యార్థులు చెబుతున్నారు. విద్యకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి.

ములుగు జిల్లాలో కస్తూర్బా గాంధీ విద్యాలయాలు 9, ఎస్సీ బాయ్స్ అండ్ గర్ల్స్ హాస్టళ్లు 6, బీసీ హాస్టళ్లు 5, గిరిజన ఆశ్రమ పాఠశాలలు 41 ఉన్నాయి. వీటిలో సుమారు 8,500 మంది విద్యార్థులు వసతి పొందుతూ చదువుకుంటున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. వసతి గృహాల్లో కనీస సౌకర్యాలు అందుబాటులో లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు వసతి గృహాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్ని చోట్ల అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయి. చాలీచాలని గదుల్లో చదువుకుంటూ అందులోనే రాత్రిళ్లు పడుకోవాల్సిన పరిస్థితి ఉంది. సరైన బెడ్లు లేక విద్యార్థులు నేలపైన నిద్రించాల్సిన వస్తోంది. తలుపులు, కిటికీలు ఊడిపోవడం, మరుగుదొడ్లు పాడైపోవడం, గదుల్లో ఫ్యాన్లు సరిగ్గా పనిచేయకపోవడం లాంటి సమస్యలు తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయి. బాయ్స్ హాస్టల్లో స్నానపు గదులు సరిపోవడం లేదు. దీంతో బయటే స్నానాలు చేయాల్సి వస్తోంది. అనేక హాస్టళ్లల్లో తాగునీటి శుద్ధి యంత్రాలు లేవు. కొన్ని చోట్ల ఉన్నప్పటికీ అవి మరమ్మతులకు గురయ్యాయి. స్నానం చేసేందుకు వేడినీరు అందించే వాటర్ హీటర్లు లేవు. దీంతో విద్యార్థులు చన్నీళ్లతోనే స్నానం చేయాల్సి వస్తోంది.

అవస్థల నడుమ..

జిల్లాలోని పలు సంక్షేమ హాస్టళ్లు దశాబ్దాల కాలం నాటి భవనాల్లో కొనసాగుతున్నాయి. ములుగు జిల్లా కేంద్రంలోని బాయ్స్ హాస్టల్ శిథిలావస్థకు చేరగా అధికారులు నూతన భవనం కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపారు. అలాగే తాడ్వాయి మండలంలోని కాల్వపల్లి లోని గిరిజన ఆశ్రమ పాఠశాల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. ఇక్కడ తరగతి గదిలో బండలు పగిలి ఉన్నాయి. బండారుపల్లి గురుకుల ఆశ్రమ పాఠశాల చుట్టూ ప్రహరీ లేక గేదె లు, పందులు వస్తున్నాయి. వర్షం పడితే గ్రౌండ్ చిత్తడిగా మారుతోంది. సరైన తరగతి గదులు లేక 5వ, 6వ, 7వ తరగతి విద్యార్థులు అక్కడే చదువుకుంటూ అక్కడే పడుకుంటున్నారు. అందులో వారి వస్తువులు, పెట్టెలు పెట్టుకో వడంతో గది ఇరుగ్గా ఉండి విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పలు హాస్టళ్ల ఆవరణలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి పాములు వస్తున్నాయి. దీంతో విద్యార్థులు భయాందోళనకు గురవు తున్నారు. డ్రెయినేజీలు సరిగా లేక పరిసరాల్లో మురుగు నీరు నిలిచి దోమలు, ఈగలు, కీటకాలు (మిగతా 8వ పేజీలో)

బ్రహ్మోత్సవాలకు జీడికల్ ముస్తాబు

- నేటి నుంచి 17 వరకు వేడుకలు
- ఏటా ఘనంగా కార్తీక మాస ఉత్సవాలు



గర్భాలయంలో కొలువుదీరిన శ్రీ వీరాచల సీతారామచంద్రస్వామి

లింగాలఘణపురం నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లాలోని సుప్రసిద్ధ జీడికల్ వీరాచల శ్రీరామచంద్ర స్వామి ఆలయం కార్తీక మాస బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. నేటి నుంచి 17వతేదీ దరకు వైభవంగా వేడుకలు జరగనున్నాయి. ప్రతీఏటా కార్తీకమాసంలో జరిగే ఉత్సవాలకు మంగళవారం స్వస్తివాచనం లక్ష్మీపూజతో వేడుకలను ప్రారంభించేందుకు ఆలయ ఈవో చిందం వంశీ, బ్రహ్మోత్సవ వేడుకల కో ఆర్డినేటర్, జనగామ ఆర్డీవో గోపీరామ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లను చేశారు. ఇందులో భాగంగా చలువ పందిళ్ల నిర్మాణం, తాగునీటి వసతి, గుట్టపై భక్తులకు సౌకర్యార్థంగా జీడిగుండం, పాలగుండంలో పారిశుధ్య చర్యలు చేపట్టారు.

బ్రహ్మోత్సవ కార్యక్రమాలు..

ఈనెల 5న ఉదయాన్నే కార్తీక పుష్కర స్నానాలు, 6నుంచి 7 వరకు నిత్యనిధి కార్యక్రమాలు, 8న అంకురార్పణ, అగ్నిప్రతిష్ట, 9న నిత్యహవనం, గరుడపటాధివాసం, మంటపద్వారణ, తోరణ పూజ, ధ్వజారోహణం, బలిహరణం, భేరిపూజ, ఎదుర్కోళ్లు, డిసెంబర్ 10న స్వామివారి కల్యాణమహోత్సవం, 11న నిత్యాహవనం, రథోత్సవం, 12న పూర్ణాహుతి, 13 నుంచి 15 వరకు నిత్యనిధి, 16న చక్రస్నానం, 17న శతఘటాభిషేకం, మహదాశీర్వచనం కార్యక్రమాలు జరగనున్నాయి.

కాళేశ్వరాలయంలో సహస్ర దీపాలంకరణ



ఆలయావరణలో సహస్ర దీపాలంకరణలో మహిళలు, అధికారులు

మహదేవపూర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వరాలయంలో సోమవారం సహస్ర దీపాలంకరణ కార్యక్రమం చేపట్టారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాల మేరకు కార్తీక సోమవారం సందర్భంగా ఈకార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

రామప్ప ఆలయంలో విదేశీయుల సందడి



గైడ్ ద్వారా ఆలయ విశిష్టతను తెలుసుకుంటున్న విదేశీయుడు

వెంకటాపూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్‌లోని ప్రఖ్యాత రామప్ప దేవాలయాన్ని జపాన్‌కు చెందిన మాకోతో, రోమానియాకు చెందిన బేట్రిస్ భజేనర్, యూకేకు చెందినజాకబ్‌స్పెన్స్ సోమవారం సందర్శించారు. ముందుగా వారు రామలింగేశ్వరస్వామిని దర్శించుకోగా అర్చకులు ఉమాశంకర్, హరీశ్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈసందర్భంగా వారు ఆలయ శిల్పకళా సంపదను కనులారా వీక్షించి అబ్బురపడ్డారు. ఆలయ చరిత్ర, విశిష్టత గురించి గైడ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి దేవాలయం ప్రపంచంలో ఎక్కడా లేదని, ఆలయ శిల్పకళా సౌందర్యం ఎంతో అద్భుతంగా ఉందని అన్నారు. అనంతరం సరస్సు వద్దకు చేరుకుని బోటులో విహరిస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదించారు.

బుగులోని జాతరకు సర్వం సిద్ధం

నేటి నుంచి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



విస్తరణ చేసిన మెట్లు

రేగొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని బుగులోని వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమైంది. మంగళవారం నుంచి జాతర ప్రారంభం కానుండగా అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ గంగుల రమణారెడ్డి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు ఈనెల 8 వరకు కొనసాగనున్నాయి. తొలి రోజు ఉదయం 8 గంటలకు స్వామి వారిని ఊరేగింపుగా బుగులోని గుట్ట వద్దకు తీసుకొస్తారు. సాయంత్రం 6 గంటలకు కల్యాణం నిర్వహించి, తిరిగి గుట్టపై చేర్చుతారు.

బుగులోని జాతరలో ఎప్పుడూ లేని విధంగా కొత్తగా పలు మెరుగైన



కొత్తగా నిర్మించిన కల్యాణ మండపం

సౌకర్యాలను భక్తులు అందుకోనున్నారు. తలనీలాలు తీయడానికి షెడ్డు, స్నానాలకు గుండం, స్వామి వారి కళ్యాణ మండపాన్ని ఇక్కడ నిర్మించారు. తాగు నీటికి ఇబ్బందులు కలగకుండా కొత్తగా కొండ పైన ఆర్‌వోఆర్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. క్యూలైన్లలో వెళ్లే వారు కూడా దాహం వేస్తే ఇబ్బందిపడే పరిస్థితి లేకుండా తాగునీటిని సమకూర్చారు. జాతరలో అక్కడక్కడ నీటి ట్యాంకర్లను అందుబాటులో ఉంచుతున్నారు. పది చోట్ల చేతిపంపులను సిద్ధం చేశారు.

భద్రత ఏర్పాట్లు

జాతరలో భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు నేతృత్వంలో భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. 175 మందిసిబ్బంది, 25 మంది ఎస్సైలు, సీఐలు, ఇతర ఉన్నతాధికారులు విధులు నిర్వర్తించనున్నారు. కల్వర్టులు, రోడ్డు పక్కనే బావులు ఉన్న చోట ప్రమాద సూచికలుగా రేడియం రిబ్బన్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ జామ్ కాకుండా ప్రత్యేక ప్రణాళికను రూపొందించారు. ఇందులో భాగంగా మూడుచోట్ల పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు.

నిరంతరంగా పారిశుధ్య నిర్వహణ.. వైద్య సేవలు

జాతరలో పారిశుధ్యం కోసం 50 మందికి పైగా సిబ్బంది నిరంతరంగా విధులు నిర్వర్తించనున్నారు. రోడ్లపై దుమ్ము లేవకుండా ఐదు ట్యాంకర్లతో నిత్యం నీళ్లు చల్లుతున్నారు. భక్తులు వదిలి వెళ్లే వ్యర్థాలను తరలించేందుకు ఆరు ట్రాక్టర్లను అందుబాటులో ఉంచారు. జాతరలో భక్తులకు ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా, ప్రమాదాలు సంభవించినా ప్రథమ చికిత్స చేయడానికి ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తున్నారు. దీంతోపాటు అంబులెన్సులను అందుబాటులో ఉంచుతున్నారు.

భక్తుల కోసం ప్రత్యేక బస్సులు

జాతరకు వచ్చే భక్తుల కోసం భూపాలపల్లి, పరకాల వైపు నుంచి ప్రత్యేక సర్వీసులను ఆర్టీసీ ఏర్పాటు చేసింది. వరంగల్ వైపు నుంచి వచ్చే భక్తుల కోసం పరకాల బస్టాండ్‌లో బస్సులు నిత్యం అందబాటులో ఉండేలా ఏర్పాటు చేశారు. భూపాలపల్లి డిపో నుంచి వచ్చే బస్సులు వయా చెల్పూర్, గాంధీనగర్, మైలారం, కొత్తపల్లి క్రాస్ మీదుగా పాండవులగుట్ట వరకు నడుపుతున్నారు. పరకాల వైపు నుంచి వచ్చే బస్సులు రేగొండ, జగ్గయ్యపేట మీదుగా బుగులోని జాతరకు చేరుకుంటాయి.

చేప పిల్లల పంపిణీని పారదర్శకంగా చేపట్టాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి శ్రీహరి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ములుగు కలెక్టర్ దివాకర, అధికారులు

ములుగు కలెక్టరేట్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేపపిల్లల పంపిణీ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకాటి శ్రీహరి అన్నారు. హైదరాబాద్ నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ములుగు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ టీఎస్.దివాకర, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి శ్రీహరి చేపల పంపిణీ టెండర్లు ఫైనల్ చేయడం, చేపల పంపిణీ పర్యవేక్షణ, ఇతర శాఖల అధికారుల నియామకం, యాక్షన్‌ప్లాన్ తయారీ, తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రూ.122 కోట్ల22 లక్షలు ఖర్చుచేసి 83 కోట్ల చేపపిల్లలు, 10 కోట్ల రొయ్య పిల్లలను 26,357 నీటి వనరులతో పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. చేపపిల్లల పంపిణీ కార్యక్రమం అమలులో చాలా జిల్లాలు వెనుకబడి ఉన్నాయని, ఇందులో ములుగు జిల్లా కూడా ఉందని అన్నారు. కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టిసారించి నీటివనరుల్లో చేపపిల్లల విడుదల కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ప్రస్తుత సమయంలో నీటివనరులలో చేపలు విడుదల చేస్తేనే మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉందని అన్నారు.

టీ-మత్స్య యాప్‌లో చేపపిల్లల వివరాలు, సరఫరాదారుల వివరాలు, రవాణాచేసే వాహనం సంపూర్ణ వివరాలను మత్స్య శాఖ అధికారి పకడ్బందీగా నమోదు చేయాలన్నారు. చేపపిల్లల పంపిణీ కార్యక్రమాన్ని మత్స్యశాఖ అధికారులతోపాటు నీటిపారుదలశాఖ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు, ఎంపీడీవో, జిల్లా పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ విస్తరణాధికారులు పర్యవేక్షించాలని మంత్రి సూచించారు. జిల్లాలోని ప్రతి రిజర్వాయర్‌కు నీటి పారుదల అధికారి, పంచాయతీ అధికారి, చెరువులకు ఎంపీడీవో, మండల వ్యవసాయ అధికారి, కుంటల పర్యవేక్షణకు పంచాయతీ కార్యదర్శులకు బాధ్యతలు అప్పగించాలన్నారు. రాబోయే 18రోజులు చాలా కీలకంగా ఉంటుందని, గతంలో ఉన్న అభియోగాలను పూర్తిగా తొలగించేలా పారదర్శకంగా ఈ కార్యక్రమం జిల్లాలో నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ప్రభుత్వ స్థలాల్లో చేపల స్టాల్స్, ఫిష్ మార్కెట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా మత్స్యశాఖ అధికారి తోడేటి సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి సివిల్ సప్లయ్ అధికారుల పర్యటన

భూపాలపల్లిటౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8 నుంచి జిల్లాలోని పలు మండలాల్లో సివిల్ సప్లయ్ అధికారుల బృందం పర్యటించనున్నట్లు కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. సోమవారం ఐడీవోసీ సమావేశ మందిరంలో సివిల్ సర్వీసెస్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ముస్సోరి నుంచి మొత్తం 12 మంది గల సివిల్ సర్వీసెస్ అధికారుల బృందం జిల్లా పరిధిలోని పలిమెల, మహాముత్తారం మండలాల్లో ఈ నెల 8 నుంచి 15వరకు పర్యటించనున్నట్లు తెలిపారు. ఆయా మండలాల్లో అధికారులు ఏర్పాట్లు చేయాలని తెలిపారు.

టీజేఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా శ్రీనాథ్



కృష్ణకాలనీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి విద్యార్థి విభాగం భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడిగా పొక్కారి శ్రీనాథ్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం జాగృతి జిల్లా అధ్యక్షుడు మాడ హరీశ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. జాగృతి బలోపేతానికి పాటుపడుతున్న దృష్ట్యా జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కవిత ఆదేశానుసారం ఈ నియామకం చేపట్టినట్లు హరీశ్‌రెడ్డి తెలిపారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నితిన్

జల్సాలకు అలవాటుపడి దొంగతనాలు

నలుగురి నిందితుల అరెస్టు : ఏసీపీ

జనగామ రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడి వాహనాలు దొంగతనం చేస్తున్న నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్ తరలించడం జరిగిందని జనగామ ఏసీపీ పండారి చేతన్ నితిన్ అన్నారు. జనగామ ఏసీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ సూర్యపేట జిల్లాకు చెందిన చెవుల మనోజ్, గొర్ల శివారెడ్డి, ఆరే విజయ్, వీరబోయిన భరత్ అనే యువకులు జల్సాలకు అలవాటు పడి దొంగతాలను పాల్పడుతున్నట్లు తెలిపారు.

జనగామ జిల్లా కేంద్రంలో దొంగతనాలు చేయగా బాధితులు కావడి అనిల్ కుమార్, జాలిగం మహేశ్ అనే వ్యక్తులు వాహనాలు దొంగిలిచడంతో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరిగిందన్నారు. నిందితులను పట్టుకొని వారి వద్ద నుంచి ఒక కారు, రెండు బైకులను స్వాధీనం చేసుకొని రిమాండ్ తరలించమన్నారు. గతంలో వారిపై అనేక కేసులు నమోదైనట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన సీఐ సత్యనారాయణ రెడ్డి, ఎస్సై భరత్, కానిస్టేబుళ్లు కరుణాకర్, సాగర్, బి.కృష్ణ, కుమారస్వామిలను సీపీసన్ ప్రీత్ సింగ్ అభినందించారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

దేవరుప్పుల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మానసికపరిస్థితి సరిగాలేని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం జనగామ జిల్లా దేవరుప్పుల మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్ఐ సృజన్ కుమార్ కథనం ప్రకారం దేవరుప్పులకు చెందిన చిట్టబోయిన మహంకాళి(50)కి భార్య, కుమార్తె ఉన్నారు. అయితే కొంతకాలంగా మహంకాళి మానసిక పరిస్థితి సరిగా ఉండడం లేదు. దీనికి తోడు కుటుంబ కలహాలు తోడయ్యాయి. కాగా, సోమవారం ఉదయం బావి దగ్గరకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి, పొల వద్ద బావిలో ఉరి వేసుకున్నాడు. మృతుడి కూతురు సంధ్య ఫిర్యాదుతో కేసు నమోదు దర్యాప్తు చేస్నున్నారు.

ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై గుర్తుతెలియని వ్యక్తి దాడి

జనగామ రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై గుర్తుతెలియని వ్యక్తి దాడి చేసిన ఘటన జనగామ మండలంలో సోమవారం చోటు చేసుకుంది. జనగామ డిపోకు చెందిన బస్సు సిద్దిపేట వెళ్తున్న క్రమంలో మండలంలోని చంపక్‌హిల్స్ వద్ద రోడ్డు మరమ్మతు పనులు జరుగుతున్న క్రమంలో బస్సు వెనకాల వస్తున్న కారు డ్రైవర్లు దుమ్ము లేస్తోందని బస్సు అద్దాలను ధ్వంసం చేశారు. అనంతరం డ్రైవర్ ఎం.మీన్యాపై దాడి చేసి పరారయ్యారు. అనంతరం డ్రైవర్ జనగామ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

వైద్యం కోసం అర్ధరాత్రి వాగు దాటి..

బిడ్డను ఆస్పత్రికి తీసుకెళ్లిన తల్లిదండ్రులు



పాపను భుజాలపై ఎత్తుకొని వాగు దాటుతున్న తల్లిదండ్రులు

ఏటూరునాగారం రూరల్, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): తీవ్ర జ్వరంతో బాధపడున్న కూతురును కాపాడుకొనేందుకు తల్లిదండ్రులు పడరాని పాట్లు పడ్డారు. గ్రామంలో ఆస్పత్రి లేకపోవడంతో మండల కేంద్రానికి అర్ధరాత్రి బయల్దేరారు. పాపను భుజాలపై ఎత్తుకొని ప్రమాదకరమైనా ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును దాటి వెళ్లారు. ఈ సంఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం కొండాయిలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది.

కొండాయికి చెందిన మాధరి, శేఖర్ దంపతులకు ఇద్దరు కూతుళ్లు. చిన్న కూతురైన ఆరేళ్ల పాపకు తీవ్ర జ్వరం వచ్చింది. ఇంట్లో ఉన్న సిరప్‌ను పోసినప్పటికీ జ్వరం తగ్గకపోగా మరింత తీవ్రమైంది. గ్రామంలో ఆస్పత్రి లేకపోవడంతో మండల కేంద్రం ఏటూరునాగారం తీసుకెళ్లాలని నిర్ణయించారు. అయితే.. అక్కడికి వెళ్లేందుకు దారి సరిగా లేకపోగా ఇటీవల కురిసిన వర్షాలకు దొడ్ల- మల్యాల మధ్య జంపన్నవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. పాప జ్వరానికి తల్లడిల్లుతుండటాన్ని తట్టుకోలేని తల్లిదండ్రులు జ్వరంతో బాధపడుతున్న చిన్న కూతురితోపాటే పెద్ద కూతురిని భుజాలపై ఎత్తుకొని ఉధృతంగా ప్రవహిస్తున్న జంపన్నవాగును దాటారు. ఏటూరునాగారంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో కూతురును చేర్పించగా ప్రస్తుతం ఆ చిన్నారి ఆరోగ్యం నిలకడగానే ఉందని తల్లిదండ్రులు తెలిపారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా

ఏటూరునాగారం రూరల్, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): గిరిజన దర్బార్‌లో గిరిజనులు ఇచ్చే వినతులను పరిశీలించి, తద్వారా వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సెక్టోరియల్ అధికారులను ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా ఆదేశించారు. ములుగు జిల్లా మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం గిరిజన దర్బార్ నిర్వహించిన ఆమె వినతులు స్వీకరించారు. గిరిజన దర్బార్‌లో మొత్తం 10 మంది గిరిజనులు తమ సమస్యలను పీవో దృష్టికి తీసుకెళ్లారు. ఏటూరునాగారం, మంగపేట, గూడూరు, గోవిందరావుపేట, మహబూబాబాద్, తాడ్వాయి, కన్నాయిగూడెం మండలాల నుంచి గిరిజనులు తరలి వచ్చి సీసీ రోడ్ల నిర్మాణాలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, వసతి గృహ నిర్మాణం, గిరి వికాసం పథకం, జీసీసీలో సేల్స్‌మెన్ ఉద్యోగావకాశాలు కల్పించాలని పీవోకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో సురేష్ బాబు, డిప్యూటీ డీఎంహెచ్‌వో క్రాంతికుమార్, మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి క్రీడా ఎంపికలు

జనగామ కల్చరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి పాఠశాల క్రీడలు ఉత్సాహంగా జరిగాయి. సోమవారం జనగామ జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలకు సంబంధించి అండర్-14, అండర్-17 విభాగాల్లో బాలబాలికలకు క్రీడా ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలలో జనగామ చుట్టుపక్కల నుంచి 800 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపికైన క్రీడాకారులు 5న జాకారంలో జరిగే ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి కబడ్డీ ఎంపికల్లో, వరంగల్ సిటీలో జరిగే ఖోఖో ఎంపికల్లో, భూపాలపల్లిలో జరిగే వాలీబాల్ ఎంపికల్లో పాల్గొంటారని జిల్లా పాఠశాల క్రీడా కార్యదర్శి గోరేసింగ్ తెలిపారు. కార్యక్రమంలో పీఈడీలు, పీఈటీలు కిష్టయ్య, మనోజ్, కుద్దూస్, లచ్చిరాం, ఆడెపు శ్రీనివాస్, సుక్కమ్మ, వీర్య నాయక్, సుధారాణి, కొండ రవి, యాది, సుశీల, మాధవి, పద్మ, సాంబయ్య, సోమల్లు, మహేష్, అశోక్, దేవ్‌సింగ్, శీను, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పట్టుకున్నారు.. వదిలేశారు?

- చర్చనీయాంశంగా అధికారి తీరు

మహదేవపూర్ రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : కాటారం సబ్ డివిజన్ పరిధిలోని ఓ పోలీసు అధికారి తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తనిఖీల పేర హడావిడి చేస్తున్న ఆయన అమ్యామ్యాలు చెల్లిస్తే వదిలేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. తనిఖీల్లో పట్టుబడ్డ బైకులను వదిలేసేందుకు చేతివాటం ప్రదర్శిస్తున్నారనే చర్చ జోరుగా సాగుతోంది.

డ్యూటీలో భాగంగా ఇటీవల ఓ కోడి పందేల స్థావరంపై ఆయన దాడి చేసినట్టు తెలిసింది. ఇక్కడ వరకు బాగానే ఉన్నా స్వాధీనం చేసుకున్న పందెం కోళ్లను రెండు రోజుల పాటు ఓ స్థావరంలో ఉంచినట్లు సమాచారం. కోళ్ల కోసం ఎవరూ రాకపోవడంతో వాటిని మాయం చేశారని గ్రామాల్లో జోరుగా చర్చ సాగుతోంది. ఇంకొందరైతే అప్పనంగా వచ్చాయని వండుకతిన్నారని బాహాటంగానే మాట్లాడుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఆ అధికారి కింద పనిచేసే సిబ్బంది సైతం ఇలాంటి వ్యవహారాల్లో ఆరితేరినట్లు తెలుస్తోంది. తనిఖీల పేర వసూళ్లకు పాల్పడుతున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. తనిఖీలు, దాడుల్లో పట్టుబడిన వారిపై ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా వదిలేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కోడి పందేల స్థావరంపై దాడిలో స్వాధీనం చేసుకున్న కోడి పుంజుల మాయంపై కాటారం డీఎస్పీ సూర్యనారయణను వివరణ కోరగా అది తమ దృష్టికి రాలేదన్నారు. కోడి పందేలను అక్రమంగా నిర్వహించడం, అనూహ్యంగా పట్టుబడుతుండటంతో బాధితులు చేసేదేమీ లేక కోళ్లను వదులు కోవాల్సి వస్తోందని తెలుస్తోంది. పందేలా నిర్వహణపై కఠినంగా వ్యవహరించాల్సిన పోలీసులు ఒక పక్క దాడులు నిర్వహిస్తూనే కేసులను నీరుగారుస్తుండటంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

చెక్కుల పంపిణీపై అధికారుల నిర్లక్ష్యం: ఎమ్మెల్యే పల్లా

జనగామ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జనగామ నియోజకవర్గంలోని బచ్చన్నపేట, తరిగొప్పుల, నర్మెట, జనగామ మండలాల్లో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సోమవారం ప్రకటనలో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సంవత్సరం కాలంగా చెక్కులు ఇస్తామంటూ వాయిదాలు వేస్తూ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రతి నెల పంపిణీ చేస్తామని చెబుతూ.. పదే పదే తేదీలను మారుస్తున్నారని, పలుమార్లు తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ చర్యలు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు సార్లు చెక్కుల పంపిణీకి తేదీలను ఖరారు చేసిన కాంగ్రెస్ నాయకులు టైం ఇవ్వడంలేదన్న పేరుతో అధికారులు కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నారని ఆరోపించారు. చెక్కుల గడువు ముగియడంతో తిరిగి వాలిడిటీ చేయించినా ఇప్పుడు ఆ గడువు కూడా ముగుస్తోందన్నారు. లబ్దిదారులు ప్రతీ రోజు ఎమ్మెల్యే కార్యాలయానికి వచ్చి అడుగుతున్నారని, తాను అధికారులతో పదే పదే మాట్లాడినా స్పందించడం లేదన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	6920	5300
మక్కలు	1876	1521
కందులు	5909	3022
పెసళ్లు	5350	3022
పల్లికాయ (సూక)	6500	3500
పల్లికాయ (పచ్చిది)	----	----
పసుపు (కాడి)	----	----
పసుపు (గోల)	----	----
తేజ మిర్చి	12000	9500
తేజ ఏసీ	----	----
వండర్‌హాట్	----	----
వండర్‌హాట్ ఏసీ	15500	12000
యూఎస్341ఏసీ	16200	9000
దీపిక	----	----
సింగిల్‌పట్టి ఏసీ	----	----
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం

అవిశ్రాంత నిరీక్షణ

హనుమకొండ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు తాము రిటైర్ కాగానే వచ్చే బెనిఫిట్స్‌తో అన్ని సౌకర్యాలతో కూడిన ఇల్లు కట్టుకోవాలనికలలు కంటారు. తన కూతుళ్లకు మంచి సంబంధాలు చూసి పెళ్లి చేయాలనుకుంటారు. కొడుకులకు ఉన్నత చదువు కోసం విదేశాలకు పంపాలనుకుంటాడు. అప్పులను తీర్చి మిగిలిన డబ్బుతో శేషజీవితాన్ని ప్రశాంతంగా గడపాలనుకుంటారు. ఇవన్నీ రిటైర్డ్ ఉద్యోగులు కనే కలలు. కానీ ఆ కలలే కల్లలైతే... 38 ఏళ్లకుపైగా ఉద్యోగం చేసి రిటైర్ అయినా తర్వాత బెనిఫిట్స్ రాకపోతేఆ విశ్రాంత ఉద్యోగుల పరిస్థితి ఏమిటీ ? ఉమ్మడి వరంగల్ జిల్లాలో రిటైర్ అయిన విశ్రాంత ఉద్యోగులు ఇప్పుడు ఇలాంటి దయనీయ స్థితినే ఎదుర్కొంటున్నారు. 'రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వండి మహా ప్రభో...' అంటూ ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. సర్కార్ నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో చేసేది లేక వృద్ధాప్యంలో.. నిస్సహాయ స్థితిలోరోడ్డెక్కుతున్నారు. అన్ని కలెక్టర్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేస్తున్నారు. కలెక్టర్లకు వినతి పత్రాలను సమర్పిస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలను సైతం కలిసి వినతి పత్రాలను సమర్పిస్తున్నారు. అయినా పరిస్థితిలో మాత్రం మార్పు కనబడడడం లేదు. దశాబ్దాలుగా ఉద్యోగం చేస్తూ వచ్చిన జీతంతో కుటుంబ పోషణ, పిల్లల చదువులను చక్కదిద్దుకుంటూ వచ్చిన ప్రభుత్వ ఉద్యోగులు ఉద్యోగం చేస్తున్నంత కాలం జీపీఎఫ్ రూపంలో తాము కూడబెట్టుకుంటారు. రిటైర్ కాగానే అవి వెంటనే చేతికి వస్తాయని ఆశిస్తారు. కానీ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉండడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు.



కలెక్టర్ కార్యాలయానికి ర్యాలీగా వస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు



కలెక్టర్ స్నేహ శబరీష్‌కు వినతి పత్రం అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగులు (ఫైల్)

- రిటైర్డు ఉద్యోగులకు అందని బెనిఫిట్స్
- ఒక్కొక్కరికి రూ.30 నుంచి రూ.40 లక్షల వరకు బకాయిలు
- ఉమ్మడి జిల్లాలో 19 నెలల్లో 654 మందికి పైగా రిటైర్మెంట్
- బెనిఫిట్స్ అందక ఆర్థిక ఇబ్బందులు

రిటైర్ అయిన ఉద్యోగులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో గత 19 నెలల కాలంలో మొత్తం 654 మంది ఉద్యోగులు రిటైర్ అయ్యారు. వీరిలో కింది స్థాయి నుంచి పై స్థాయి వరకు వివిధ కేడర్లకు చెందిన ఉద్యోగులు ఉన్నారు. వరంగల్ జిల్లాలో 153, హనుమకొండ జిల్లాలో 172, జనగామ జిల్లాలో 102 మహబూబాబాద్ జిల్లాలో 97, ములుగు జిల్లాలో 60, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 70 మంది రిటైర్ అయ్యారు.

రావాల్సిన బెనిఫిట్స్

రిటైర్ అయినఒక్కో ఉద్యోగికి గరిష్టంగా రావాల్సిన ఆర్థిక ప్రయోజనాల్లో కమ్యూటేషన్ డబ్బులు రూ.7 నుంచి రూ.15 లక్ష లు, జీపీఎఫ్ రూ.10 నుంచి రూ.12 లక్షలు, గ్రాట్యు టీ రూ. 10 లక్షలు, ఫైనల్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ రూ. 3 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు, ప్రభుత్వ జీవిత బీమా (టీజీఎల్ఐసీ) రూ. 5 లక్షల వరకు, గ్రూప్ ఇన్సూరెన్స్ స్కీం (జీఐఎస్) రూ. 20 వేల వరకు రావాల్సి ఉంది.

గత 19 నెలల్లో...

గత ప్రభుత్వం రిటైర్మెంట్ వయసు 58 నుంచి 61 సంవత్సరాలకు పెంచింది. వయో పరిమితి పెంపుతో రాష్ట్రంలో 2021 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు ఉద్యోగ విరమణలు ఆగిపోయాయి. తిరిగి ప్రారంభమయ్యాక గత 19 నెలల కాలంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 654 మంది ఉద్యోగులు రిటైర్ అయ్యారు. వీరిలో హనుమకొండ జిల్లాలో 172, వరంగల్ జిల్లాలో 153, జనగామ జిల్లాలో 102, మహబూబాబాద్ జిల్లాలో 97, ములుగు జిల్లాలో 60, జయశంకర్ జిల్లాలో 70 మంది ఉద్యోగులు రిటైర్ అయ్యారు. వీరికి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కింద రూ.3270 కోట్లు చెల్లించాల్సి ఉంది.

కోర్టు మెట్లెక్కుతున్న బాధితులు

ఉద్యోగుల జేఏసీ ప్రభుత్వంతో చర్చలు జరిపిన నేపథ్యంలో మెడికల్ రీయింబర్స్‌మెంట్, జీపీఎఫ్ డబ్బులు కొంత మొత్తంలో జమ చేశారని ఉద్యోగ సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. రిటైర్‌మెంట్ ప్రయోజనాల చెల్లింపు జాప్యానికి వ్యతిరేకంగా కొందరు ఉద్యోగులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. నగదు రహిత వైద్యసేవలు అందడం లేదని, ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న మెడికల్ రీయింబర్స్‌మెంట్ ప్రయోజనాలు రావడం లేదని విశ్రాంత ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

అంతకు ముందు..

గతంలో ఉద్యోగి రిటైర్ అయిన రోజే అన్ని బెనిఫిట్స్ చేతికి అందజేసి అధికారులు వీడ్కోలు పలికేవారు. ఉద్యోగి రిటైర్ కావడానికి మూడు నెలల ముందు నుంచే ఆయనకు రావలసిన బెనిఫిట్స్ వివరాలను సేకరించి వాటిని క్లియర్ చేసేవారు. అన్ని బెనిఫిట్స్‌ను చెక్కుల రూపంలో అందజేసేవారు. రిటైర్ అయిన రోజున వీడ్కోలు సభను ఏర్పాటు చేసి అధికారులు ఆ ఉద్యోగి తన సర్వీస్ కాలంలో చేసిన సేవలను కొనియాడుతూ ఘనంగా సత్కరించేవారు. బెనిఫిట్స్‌ను స్వయంగా చేతికి అందజేసి వీడ్కోలు పలికేవారు. సకాలంలో బెనిఫిట్స్ చేతికి అందగానే ఆ ఉద్యోగి తన జీవిత చరమాంకాన్ని ప్రశాంతంగా గడిపేవాడు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ ఇవ్వలేని ఆర్థిక దుస్థితిలో ఉన్నందు వల్ల ఆ పరిస్థితిని తాత్కాలికంగా గట్టేందుకు ఉద్యోగ విరమణ వయో పరిమితిని మూడేళ్లు పెంచిందన్న విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఆ మూడేళ్ల కాలం పూర్తికావడంతో ఇప్పుడు మళ్లీ అదే పరిస్థితి పునరావృతం అయి రిటైర్డ్ ఉద్యోగులు ఇక్కట్ల పాలు కావలసిన దుస్థితి ఏర్పడింది.

ఆందోళనలు

తమ రిటైర్మెంట్ బెనిఫిట్స్ సకాలంలో ప్రభుత్వం చెల్లించనందుకు నిరసనగా విశ్రాంత ఉద్యోగులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆందోళనలకు దిగుతున్నారు. అన్ని కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నాలు, నిరసన ప్రదర్శనలు జరుపుతున్నారు. గత నెల 27న హనుమకొండ జిల్లాకు చెందిన రిటైర్డ్ ఉద్యోగులు పెద్ద ఎత్తున కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.

కలెక్టర్ స్నేహశబ రీష్‌కు వినతి పత్రం సమర్పించారు. బెనిఫిట్స్ అందకపోవడంతో మానసిక క్షోభకు గురై ఇప్పటి వరకు 20మంది అనారోగ్యంతో బాధ పడుతూ మనోవేదనకు గురవుతూ అసువులు బాశారని రిటైర్ ఉద్యోగులు ఈ సందర్భంగా వాపోయారు. మరికొంత మంది మానసిక కృంగుబాటుకు గురై ఇంట్లో చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయారన్నారు.



రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు మెడల్స్ ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

ముగిసిన క్రీడా సందడి

ఎస్‌జీఎఫ్ఐ అండర్-14, 17 జిమ్నాస్టిక్స్, జూడో ఎంపికలు పూర్తి

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) అండర్-14, 17 ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా హనుమకొండ జేఎన్ఎస్‌లో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్ జూడో పోటీలు సోమవారం ముగిసాయి. జేఎన్ఎస్ లోని జిమ్నాస్టిక్స్ హాల్, డీఎస్ఏబాక్సింగ్‌హాల్‌లో అండర్-14, 17బాలబాలికల విభాగంలో నిర్వహించిన జిమ్నాస్టిక్స్, జూడో పోటీల్లో వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఆ మేరకు క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి ఎస్‌జీఎఫ్ఐ అండర్-14, 17 క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి వి.ప్రశాంత్ ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులను, మెడల్స్ ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత మూడు రోజులుగా పండుగా వాతవరణంలో క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా పోటీలు నిర్వహించమన్నారు. రాష్ట్ర స్థాయి అండర్-14, 17 బాలబాలికలకు జిమ్నాస్టిక్స్ జూడో క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించగా, ఉమ్మడి పది జిల్లాల నుంచి 500మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచిన క్రీడాకారులు త్వరలో వెస్ట్ బెంగాల్‌లో జరుగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అదే విధంగా అరుణాచల్ ప్రదేశ్‌లో త్వరలో నిర్వహించే జాతీయస్థాయి జూడో పోటీలకు హనుమకొండలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఎంపిక చేస్తామన్నారు. అనంతరం విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు అతిథులు, నిర్వాహకులు మెడల్స్ బహుమతులను ప్రదానం చేశారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు (టీజీపేట) శీలం పార్థసారథి, జయశంకర్ భూపాలపల్లి డీవైఎస్‌వో రఘు, కన్వీనర్లు సీహెచ్. పెద్దిరాజు, ఎం. సురేష్‌బాబు, వీ. రాణి, ఎస్. శ్రీలత, జూడో అబ్జర్వర్ సత్యనారాయణ, సీనియర్ జిమ్నాస్టిక్స్ క్రీడాకారుడు వగలబోయిన శ్రీనివాస్, కోచ్‌లు నీలం సురేష్, రజిత, హరీష్, సీహెచ్. వెంకటేశ్వర్లు, ఆర్. సుభాష్, జి. రవీంద్రప్రసాద్, రెఫరీలు, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు మెడల్స్ ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

ప్రత్యేక లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

వరంగల్ జిల్లా జడ్జి నిర్మల గీతాంబ



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి నిర్మల గీతాంబ

వరంగల్ లీగల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశానుసారం ఈ నెల 15న నిర్వహించనున్న ప్రత్యేక లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని వరంగల్ జిల్లా జడ్జి నిర్మల గీతాంబ పిలుపు నిచ్చారు. పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కాంపోండబుల్ కేసులు, సివిల్, వివాహ సంబంధిత కేసులు, మోటారు ప్రమాద క్లెయింలు, చెక్ బౌన్స్ కేసులు తదితర రాజీపడదగు కేసులు పరిష్కరిస్తామని ఆమె తెలిపారు. ఈ లోక్ అదాలత్ కార్యక్రమానికి కక్షిదారులు, పోలీసులు సహకరించాలని న్యాయమూర్తి సూచించారు. ప్రత్యేక లోక్ అదాలత్ విజయవంతంగా నిర్వహించడంలో మీడియా పాత్ర ప్రముఖమైందని హనుమకొండ జిల్లా జడ్జి డాక్టర్ కె.పట్టాభిరామారావు అన్నారు. ఈ కార్యక్రమం సమాజానికి, న్యాయవ్యవస్థకు మంచిదని అభిప్రాయపడుతున్నట్లు న్యాయమూర్తి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శులు సాయికుమార్, క్షమాదేశ్‌పాండే, న్యాయమూర్తులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుకాసుర..!

(5వ పేజీ తరువాయి)


ప్రచారం జరుగుతోంది. అలాగే భూపాలపల్లి జిల్లా పుస్కుపల్లి క్వారీలో 4 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను విక్రయించేందుకు టెండర్లు నిర్వహించారు. ఇటీవల వరదలకు గోదావరిలో ఇసుక క్వాంటిటీ తగ్గడంతో సదరు కాంట్రాక్టర్‌కు టీఎస్ఎండీసీ అధికారులు మహదేవపూర్ క్వారీ నుంచి ఇసుక లోడింగ్‌కు అనుమతి ఇచ్చారని ప్రచారం జరుగుతోంది. అయితే టీఎస్ఎండీసీ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ఒక క్వారీకి టెండర్ వేస్తే.. మరో క్వారీ నుంచి ఇసుకను తవ్వుకుని అమ్ముకునేలా ఎలా అనుమతి ఇస్తారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రభుత్వం ముందుగానే సర్వే నిర్వహించి, ఏ క్వారీలో ఎంత ఇసుక నిల్వలు ఉన్నాయో గుర్తిస్తుంది. అంత మొత్తానికి టెండర్లు నిర్వహిస్తుంది. ఒకవేళ ప్రభుత్వం పేర్కొన్న ఇసుక నిల్వలు లేకపోయినా ఉన్న వరకే తవ్వి టీఎస్ఎండీసీకి కాంట్రాక్టరు అప్పగించాలి. కానీ, ఇతర క్వారీల్లో తవ్వుకునేందుకు ఎలాంటి అనుమతులు లేవని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

జంపన్నవాగులో ఇసుక జలగలు..

మేడారం మీదుగా గోదావరిలో కలిసే జంపన్నవాగు కూడా ఇసుకాసురులకు కాసుల వర్షం కురిపిస్తుంది. అధికార పార్టీకి చెందిన కొందరు నేతలు ఈ జంపన్నవాగుపై గుత్తాధిపత్యం చెలాయిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. అధికారాన్ని అడ్డుపెట్టుకుని టీఎస్ఎండీసీ అధికారులను తమ గుప్పిట్లో పెట్టుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గోదావరి ఇసుకకు డిమాండ్ ఉండడంతో ట్రాక్టర్లలో జంపన్నవాగు ఇసుకను ములుగు, జంగాలపల్లి, తాడ్వాయి పరిసర ప్రాంతాలకు తరలించి, ప్రభుత్వ స్థలాల్లో దర్జాగా నిల్వలు చేస్తున్నారు. నిల్వలు చేసిన ప్రాంతం నుంచి లారీల్లో ఇసుకను వరంగల్, హైదరాబాద్ ప్రాంతాలకు తరలిస్తు సొమ్ము చేసుకుంటున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఉచితంగా ఇసుకను తోడేస్తున్నారు. మేడారం స్నానఘట్టాల వద్ద కూడా ఇసుక అక్రమ దందా సాగిస్తున్నారు. రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారుల దృష్టిలో ఉన్నప్పటికీ ఇసుకాసురులకు అధికార అండ ఉండడంతో ఏం చేయలేని నిస్సహాయ స్థితిలో ఉంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అంతా.. ఆ నేతల కనుసన్నల్లోనే..

ములుగు జిల్లాలో ఇసుక అక్రమ దందాలో అధికార పార్టీకి చెందిన ఇద్దరు ముగ్గురు నేతలు కీలకంగా ఉన్నారనే టాక్ వినిపిస్తుంది. పార్టీలో కీలక పదవుల్లో ఉండడంతో పాటు చాలా మంది అధికారులు సదరు నేతల సహకారంతో పోస్టింగులు పొందారు. ముఖ్యంగా పోలీస్ పోస్టింగ్‌ల్లో ఓ నేత చక్రం తిప్పుతున్నారనే చర్చ జరుగుతోంది. పోలీసులు, రెవెన్యూ సపోర్టుతో ఇసుక అక్రమ దందాలో సదరు నేతలు ఆడిందే ఆటగా.. పాడిందే పాటగా నడుస్తుందనే ప్రచారం జరుగుతోంది. సదరు నేతల బినామీలవే ఇసుక క్వారీలు, లారీలు అధికంగా ఉన్నట్లుగా సమాచారం. ఆ లారీలకు వే బిల్లులు కూడా ఉండడం లేదని, క్వారీల వద్ద ఇసుక లోడ్ చేసుకుని హైదరాబాద్, వరంగల్‌కు అక్రమంగా తరలిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. అధికారులు నామమాత్రంగా తనిఖీలు నిర్వహించి.. ఒకటి, రెండు కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే ఇసుక లారీలతో పదుల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా అధికారుల్లో చలనం రావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నారు. ఇసుక క్వారీల వద్ద సామర్థ్యానికి మించి ఇసుకను లారీల్లో తరలిస్తున్నా పట్టించుకునే వారు లేరనే టాక్ వినబడుతుంది. క్వారీల వద్దే వే బ్రిడ్జిలను ఏర్పాటు చేసి, లారీల్లోని ఇసుకను తూకం వేయాల్సిన అధికారులు చేతులు కట్టుకుని కూర్చున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతా నేతల కనుసన్నల్లో ఏజెన్సీలో ఇసుక దందా సాగుతున్నా అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరించాల్సి వస్తుందనే టాక్ వినబడుతుంది. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి.. ఇసుక అక్రమ దందాలను కట్టడి చేసి, ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.


TUMMALA NAGESWARA RAO
Minister for Agriculture, Marketing, Cooperation and Handlooms & Textiles
Government of Telangana, Hyderabad.

Dear Shri Lalit Kumar Gupta Ji,

In continuation to the letter vide reference 1st cited, I would like to bring to your kind notice that, a mail is received from CMD CCI ON 02-11-2025 to reduce yield per acre as 7 quintals in Telangana State instead of 11.74 quintals as finalized by the State Agriculture Department.

In this regard, it is informed that, with regard to declaration of state average as 11.74 quintals per acre, the department has obtained average yield per acre from 30 District Collectors in the State individually and the details were sent to Director Agriculture for declaration of State average. The Director of Agriculture, after going through the district averages submitted by the District Collectors has declared state average as 11.74 quintals for the Cotton 2025-26 season and accordingly it is communicated to CCI for procurement. The Procurement has started on 21-10-2025 and as on 03-11-2025, 6480 MTs of Cotton was procured by CCI with 2175 Nos

సీసీఐ చైర్మన్‌కు మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రాసిన లేఖ

కొనుగోళ్ల పరిమితి తగ్గించిన సీసీఐ?

ఎకరాకు 11.74 క్వింటాళ్ల నుంచి 7 క్వింటాళ్ల పత్తి కొనుగోలు

కాటారం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్రంలో భారీ వర్షాల కారణంగా పత్తి దిగుబడులపై ప్రభావం చూపుతుందని, గతానికన్నా పత్తి కొనుగోళ్ల పరిమితిని తగ్గించింది. గతంలో ఎకరాకు 11.74 క్వింటాళ్ల పత్తిని సీసీఐ ద్వారా కొనుగోలు చేయడానికి ప్రతిపాదించగా ఈ ఏడాది ఎకరాకు 7క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయనున్నట్లు ఆన్‌లైన్ యాప్‌లో సూచించారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అనుకూలమైన భూమి, ఇతర పరిస్థితులు ఉన్నచోట 7 క్వింటాళ్ల కన్న అధిక దిగుబడులు వచ్చిన రైతుల పరిస్థితేమిటని ప్రశ్నిస్తున్నారు. అధిక దిగుబడులు వచ్చిన రైతులు మొదట ఎకరాకు 7క్వింటాళ్ల వరకు విక్రయించిన అనంతరం అధికారులతో కూడిన కమిటీని సంప్రదిస్తే వారు సిఫారస్ చేస్తేనే సీసీఐ కొనుగోలు చేయనుంది. మండల తహసీల్దార్ చైర్మన్, మార్కెటింగ్ కార్యదర్శి మెంబర్ కన్వీనర్, ఎస్‌హెచ్‌వో (ఎస్సై), మండల వ్యవసాయ అధికారి(ఏవో) సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. కాగా పత్తి కొనుగోళ్ల పరిమితిని గతంలోలాగా ఎకరాకు 11.74క్వింటాళ్లు పరిమితి ఉంచాలని, తేమ శాతం 20వరకు అనుమతించాలని, స్టేట్ కాటన్ మిల్లర్స్, మిల్లర్స్ సమస్యలను పరిష్కరించాలని సీసీఐ చైర్మన్, సీఎండీ లలిత్‌కుమార్‌కు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు నవంబరు 2న లేఖ రాశారు. 2025-2026సీజన్ పత్తి కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా జరిగిలే చూడాలని, రైతులకు ఇబ్బంది కల్గకుండా చేయాలని లేఖలో కోరారు.

మహిమాన్వితం కందగిరి క్షేత్రం

కార్తీక పౌర్ణమి వేళ హోరెత్తనున్న లక్ష్మీనర్సింహస్వామి జాతర



గర్భగుడిలో పూజలు చేస్తున్న అర్చకులు (ఫైల్)



కందగిరి పర్వతంపై ఉన్న లక్ష్మీ నర్సింహస్వామి ఆలయం (ఫైల్)

కురవి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి రమణీయతకు నెలవు కందగిరి. పచ్చని చెట్లు.. గుట్టలు.. ఆయుర్వేద మూలికలకు సంబంధించిన చెట్ల సువాసనలతో భక్తి పారవశ్యంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు. సెలయేర్లు.. నీటి దొనలు.. లోయలు.. ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తాయి. గుట్టపైకి వచ్చే భక్తులతో ఆ ప్రాంతమంతా సందడిగా మారనుంది. కపిలవాయి మహాముని తపస్సుచే పునీతమై శ్రీ లక్ష్మీనర్సింహస్వామి వెలసిన కందికొండ జాతర కార్తీకపౌర్ణమి పురస్కరించుకుని ఈనెల 5న బుధవారం జరుగనుంది.

మహబూబాబాద్ జిల్లా కురవి మండలం కందికొండ శివారు కందగిరి పర్వతంపై రెండు శతాబ్దాలుగా జరుగుతున్న ఈ జాతరకు పూర్వపు వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల పరిధిలోని వేలాది మంది భక్తులు విచ్చేస్తారు. ఈ గుట్టను అధిరోహించే భక్తులకు అనేక ప్రకృతి అందాలు అలరిస్తాయి. కొండపైన అసంఖ్యాకమైన పుష్కరిణి(కోనేరు) ఉన్నాయి. స్వామి పుష్కరిణి, దిగువ పుష్కరిణిలు సహా, సప్త పుష్కరిణులు ఉన్నాయి. వీటినే ఏడుదొనలు అంటారు. ఇక్కడికి ఒక పర్యాయం స్వామిని దర్శించుకొనుటకు సప్తరుషులు వచ్చి పుష్కరిణిలో స్నానం చేశారని చరిత్ర చెబుతోంది. ఇక్కడ స్నానం చేస్తే, చర్మవ్యాధులు పోతాయని ప్రతీతి. ఇక్కడ ఉండే మధుర పుష్కరిణికి, నీరు ఎక్కడి నుంచి వస్తుందో తెలియదు కానీ, ఇందులో నీరు కలకాలం ఉంటుంది. అంతేకాక వెదురు, దేవదారు, తింత్రిణీ వృక్షాలతో కీకారణ్యాన్ని మరిపిస్తుంది. అంతేకాక పూర్వకాలంలో యుద్ధానికి అవసరమయ్యే మందు గుండు సామాగ్రి దాచుకునేందుకు నిర్మించిన మందుల కొట్టు భక్తులను విశేషంగా ఆకర్షిస్తుంది. గుర్రాల మండవ, కోటి లింగాలు ఎంతగానో ఆకర్షిస్తాయి.

క్షేత్రపురాణం..

హిరణ్యకశపుడి సంహారం అనంతరం నరసింహస్వామి లక్ష్మీదేవితో భూతలంపై సంచరిస్తూ అనేక ప్రదేశాలలో అర్చామూర్తిగా వెలుగొందారని, సంహాద్రి, వేదాద్రి, కందాద్రి(కందికొండ) మొదలగు గిరులపై కాలిడి స్వయం భువుగా వల్మీకరూపంలో వెలిశారని ఆలయ వేదపండితుడు నల్లప్రోల్ పురుషోత్తమాచార్యులు తెలిపారు. కార్తీకపౌర్ణమి నాడు నరసింహస్వామి, లక్ష్మీదేవిల వివాహానికి హాజరైతే కోరిన కోర్కెలు తీరుతాయని ప్రతీతి ఉందని ఆయన తెలిపారు.

ముందుకు సాగని ధాన్యం కొనుగోళ్లు

- తేమ శాతం పేరుతో అధికారుల బ్రేక్
- అకాల వర్షాలతో ఇబ్బందులు పడుతున్న రైతులు



సూరారంలో ఐకేపీ కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న వరి ధాన్యపు రాశులు

ఎల్కతుర్తి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అట్టహాసంతో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు ఒక్క ధాన్యపు గింజను కొనలేదు. ఎల్కతుర్తి మండల పరిధిలో ఐకేపీ, సొసైటీల ద్వారా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను 10 రోజుల క్రితం ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి నేటి వరకు గింజ ధాన్యాన్ని కొనలేదని పలువురు రైతులు ఆగ్రహిస్తున్నారు. తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తామని ఇచ్చిన హామీలు ఏమైయ్యాయని రైతులు మండిపడుతున్నారు. ఇటీవల మొంథా తుఫాన్ ప్రభావంతో ప్రతి రోజు కురుస్తున్న వర్షానికి ఆరబోసిన ధాన్యంలో సైతం తేమ శాతం ఎక్కువగా ఉంటుంది. అయినప్పటికి రైతులు ప్రతి రోజు ధాన్యాన్ని తిరగేసి మరి తేమ శాతం లేకుండా జాగ్రత్తలు పడుతున్నారు. కాని కొనుగోలు కేంద్రం నిర్వహకులు మాత్రం ధాన్యంలో తేమ శాతం ఉంటుందంటు కొర్రీలు పెట్టి కొనుగోళ్లు చేయడం లేదని ఆరోపిస్తున్నారు. దీంతో అకాల వర్షం కురిస్తే ఇన్ని రోజులు పడిన శ్రమ వృదా కావడంతో పాటు భారీ నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అకాల వర్షాలతో ఆరిన ధాన్యన్ని కుప్ప పోసినప్పటికి తిరిగి తేమ వస్తుందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యంలో 17 శాతం తేమ ఉన్నప్పటికి కొనుగోలు చేయాలనే నిబంధనలు ఉన్నప్పటికి కొనుగోలు కేంద్రాల నిర్వహకులు మాత్రం 13 నుంచి 14 శాతం వస్తేనే కొనుగోలు చేస్తామని సూచిస్తున్నారు. దీంతో రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ధాన్యాన్ని ఆరబోయడానికి కళ్లాలు లేక దిక్కుతోచని స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. సూరారం, వల్బాపూర్, కోతులనడుమ, ఎల్కతుర్తి గ్రామాలకు చెందిన కొందరు రైతులు ఎన్‌హెచ్ 563పై ధాన్యాన్ని ఆరబోయగా వర్షానికి ధాన్యం కుప్పలు కొట్టుకుపోయి తీవ్రంగా నష్టపోతున్నారు. రైతులకు భారీ నష్టం వాటిల్లిన వారికి ఓదార్పు కరువైందని పలువురు ఆరోపిస్తున్నారు.

మేడారంలో జోరుగా పునరుద్ధరణ పనులు

తాడ్వాయి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మేడారంలో పునరుద్ధరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇందులో భాగంగా సమ్మక్క దేవస్థానం చుట్టూ ఉన్న సాలాహారం, ప్రాకారాన్ని అధికారులు తొలగించారు. దేవస్థానం చుట్టూ బేస్‌మెంట్ పనులు ముగుస్తున్న క్రమంలో ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా ఈ నెల 7 నుంచి గ్రానైట్ పనులు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే హుండీల ఏర్పాటుకు ప్రత్యేక గదిని దేవస్థానం కార్యనిర్వహణ అధికారి వీరస్వామి, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, పూజారుల సమక్షంలో సోమవారం ఏర్పాటు చేశారు. దీంతో దేవస్థానం పునరుద్ధరణ పనుల్లో భాగంగా తొలగిస్తున్న నిర్మాణాల్లో వనదేవతల హుండీలను భద్రపరిచే వాచ్‌టవర్ తొలగిస్తున్నారు. ఈ క్రమంలో నూతనంగా ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేసి నిఘా నేత్రాల పర్యవేక్షణలో గదిని ఏర్పాటు చేశారు. అనంతరం వాచ్‌టవర్ గదిలోని 27 హుండీలను నూతన గదికి తరలించారు.

వాచ్‌టవర్ల నిర్మాణానికి పునాది

దేవస్థానం పునరుద్ధరణ పనుల్లో భాగంగా వాచ్‌టవర్ల నిర్మాణ పనులను అధికారులు సోమవారం ప్రారంభించారు. మూడు ఫ్లోర్లతో గద్దెలకు ఇరువైపులా నాలుగు టవర్లు నిర్మించాల్సి ఉండగా జాతరకు రెండు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధికారులు ముగ్గుపోశారు.



యంత్రాలతో సాగుతున్న పనులు

స్క్రాప్‌కు టెండర్

మేడారం దేవస్థానంలో తొలగించిన క్యూలైన్, ఆర్చి గేట్, పలు నిర్మాణాల తొలగింపు జరుగుతున్న క్రమంలో వస్తున్న స్క్రాప్‌ను కార్యనిర్వహణ అధికారి వీరస్వామి ఆధ్వర్యంలో టెండర్లు నిర్వహించారు. సుమారు 20టన్నుల స్క్రాప్‌ను కేజీ రూ. 27చొప్పున విక్రయించినట్లు తెలిపారు. స్క్రాప్ ద్వారా వచ్చిన నగదును దేవస్థానం అభివృద్ధికి ఉపయోగించనున్నట్లు చెప్పారు.

ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలి

అధికారులతో కలెక్టర్ దివాకర



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రజావాణిలో సమర్పించిన వినతులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ టీఎస్.దివాకర ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపు మందిరంలో ప్రజావాణి కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రజల నుంచి 46 వినతులను ఆయన స్వీకరించారు. ఇందులో గృహనిర్మాణ శాఖకు సంబంధించిన 13, భూసమస్యలు 8, పెన్షన్ 5, ఇతర శాఖలకు సంబంధించిన 20 వినతులు ఉన్నాయి. సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ అన్నారు. ఈకార్యక్రమంలో ఆర్డీవో వెంకటేశ్, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు రవి చందర్ పరామర్శ



మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న బానోత్ రవిచందర్

ములుగు రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ సోమవారం పరామర్శించారు. మండలంలోని మదనపల్లి, దేవగిరిపట్నం గ్రామాల్లో మృతుల కుటుంబాలకు క్వింటా బియ్యం, సరుకులు అందజేశారు. మృతుల కుటుంబాలకు అన్ని విధాల కాంగ్రెస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ములుగు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.డి.చాంద్ పాషా, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల్ల భరత్ కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అలోత్ దేవ్ సింగ్, మదనపల్లి మాజీ సర్పంచ్ బాబురావు, మాజీ ఎంపీటీసీ మావురపు తిరుపతి రెడ్డి, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు జన్ను రవి తదితరులు పాల్గొన్నారు.

బీసీలు మౌన దీక్షను విజయవంతం చేయాలి

ములుగు రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఈ నెల 6న జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టనున్న మౌన దీక్షను విజయవంతం చేయాలని బీసీ జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తోటకూరి శ్రీకాంత్ అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాటాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. మౌన దీక్షకు బీసీలు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు ముంజాల భిక్షపతి గౌడ్, మల్లంపల్లి మండల సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు గోల్కొండ రాజు, యాదవ సంఘం జిల్లా నాయకులు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొనాలి

వెంకటాపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ ఈనెల 17న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఢిల్లీలో చేపట్టే కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు యాసం రమేష్ పిలుపునిచ్చారు. సోమవారం మండలకేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. చలో ఢిల్లీ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలిరావాలన్నారు. ఈసమావేశంలో నాయకులు వేల్పుల మల్లేష్, యాసం మహేష్, వెంకటేశ్, కొడారి సత్యం, చెన్నం రమేష్, చిరంజీవి, గౌతమ్, తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సొసైటీ
ఉపాధ్యక్షుడు, కోఆప్షన్ సభ్యుడి ఎన్నిక



శంకర్



రఘు

ములుగు రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లా మత్స్య సొసైటీ ఉపాధ్యక్షుడిగా సాధ శంకర్, కోఆప్షన్ సభ్యుడిగా చిటమట రఘును ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం ముదిరాజ్ కమ్యూనిటీ హాల్‌లో మత్స్య సొసైటీ జిల్లా అధ్యక్షుడు సాధు రఘు అధ్యక్షతన కార్యవర్గ సమావేశంలో సోమవారం జరిగింది. డైరెక్టర్లు అలువాల ఐలయ్య, దండబోయిన రఘుపతి, సాధం రవి, శ్రీకాంత్, తీగల వీరన్న, మాటూరి నాగేంద్ర బాబు, మేకలబోయిన సాంబశివరావు, కర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వెంకటాపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి భాస్కర్ అన్నారు. సోమవారం మండలంలోని ఇప్పలగూడెం, వీఆర్కేపురం గ్రామాల్లో వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వేర్వేరుగా వైద్యశిబిరాలు జరిగాయి. ఈసందర్భంగా ఆయన గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అదేవిధంగా ఎదిర వైద్యశాలలో క్షయ రహిత సమాజంలో భాగంగా 59మందికి క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో హెచ్ఈవో కోటిరెడ్డి, సిబ్బంది యాకమ్మ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు



కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానిస్తున్న సీతారాంనాయక్

వెంకటాపూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాంజాపూర్ గ్రామంలోని కాంగ్రెస్ కార్యకర్తలు సోమవారం బీజేపీలో చేరారు. మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్ సమక్షంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆయన ఆహ్వానించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చక ప్రజా వ్యతిరేకతను కాంగ్రెస్ ఎదుర్కొంటోందన్నారు. దేశంలో వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ అవినీతి రహిత పాలనతో దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తూ అగ్రగా మిగా నిలిపారని కొనియాడారు. రాబోయే రోజుల్లో బీజేపీ తెలంగాణ రాష్ట్రంలో అధికా రంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు భూక్య జవహర్‌లాల్, జిల్లా ప్రధానకార్యదర్శి నగరపు రమేష్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు రెడ్డి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు పైడాకుల మల్లేష్, ఆరెల్లి రాజు, తాళ్లపల్లి రమేష్, పోశాల మహేందర్, భీమినేని శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్లకు బీసీ నేతల వినతి

కృష్ణకాలనీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను అమలు చేయాలని కోరుతూ బీసీ జేఏసీ నేతలు భూపాలపల్లి తహసీల్దార్‌కు సోమవారం వినతి పత్రాన్ని అందించారు. రాబోయే శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఈ బిల్లును తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ నేతలు పైడిపెల్లి రమేష్, కొత్తూరి రవీందర్, తాటి వెంకటేశ్వర్లు, చెరుకుతోట శ్రీరాములు, బీమనాథుని సత్యనారాయణ, జోగు బుచ్చయ్య, జోగుల సమ్మయ్య, గోగుల మదన్‌మోహన్, క్యాతరాజు సాంబమూర్తి, శేఖర్‌నాని, పెంట సదానందం యాదవ్, పందిళ్ల రమేష్, శీలపాక హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

● కాటారం (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల సాధన సమితి నాయకులు తహసీల్దార్ నాగరాజుకు వినతి పత్రాన్ని అందజేశారు. బీజేపీ, కాంగ్రెస్ నేతృత్వంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ రిజర్వేషన్ల అమలు బాధ్యతను తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ, ఎస్సీ ఎస్టీ జేఏసీ కోఆర్డినేటర్ చిట్యాల శ్రీనివాస్, ముదిరాజ్ సంఘం జిల్లా నేత జోడు శ్రీనివాస్, బీసీ జేఏసీ జిల్లా కన్వీనర్ అందె భాస్కర్, పలు సంఘాల నేతలు ఓలపు రాజబాపు, వంగల జనార్దన్, శ్యాం, మహేష్, రమేష్, శ్రీకాంత్, సురేష్, మానెం రాజబాబు, మల్లయ్య, రాజబాపు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



భూపాలపల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న బీసీ జేఏసీ నేతలు

● గణపురం (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ బీసీ జేఏసీ చైర్మన్ బత్తిని శివశంకర్ ఆధ్వర్యంలో తహసీల్దార్ సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. మల్లిఖార్జున్, రాజేందర్, కండె రవి, దుర్గయ్య, తిరుపతి, స్వామినాథన్, భాషా, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

● మహాముత్తారం (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్ల అమలుపై బీసీ సంఘాల నాయకులు తహసీల్దార్ డి. శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. బీసీ జేఏసీ జిల్లా కన్వీనర్ అందే భాస్కరాచారి, బీసీ సంఘం నాయకులు వెంకటస్వామి, ప్రవీణ్, సాహిత్ తదితరులు పాల్గొన్నారు.

● టేకుమట్ల (ఆంధ్రజ్యోతి): బీసీ జేఏసీ నాయకులు తహశీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో అనితకు వినతిపత్రం అందజేశారు. బీసీ జేఏసీ మండల కన్వీనర్ నేరేళ్ల రామకృష్ణ బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ మండల కన్వీనర్ దాసారపు భాస్కర్, ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు ఆకినపల్లి శ్యాం, గౌడ సంఘం అధ్యక్షుడు మామిండ్ల ఎల్లాస్వామి, వివిధ సంఘాల నాయకులు బందెల శ్రీనివాస్, ఆకోజ్ దేవేందర్, మేడిపల్లి నరేష్, రాజేందర్, బండి రాజేంద్రప్రసాద్, ఎమ్మార్పీఎస్ టిఎస్ జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

● చిట్యాల (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ బీసీ, ఎస్సీ ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. జేఏసీ మండల కోఆర్డినేటర్ చింతల రమేష్, నాయకులు బుర్ర శ్రీధర్, శీలపాక నాగరాజు, జన్న విజేందర్, పర్లపల్లి కుమార్, పుల్ల అశోక్, నేరెళ్ల రమేష్, గడ్డం కొంరయ్య, పొన్నం అశోక్, మట్టెవాడ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కోతుల బెడద నుంచి రక్షించాలి

ములుగు టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా కోతుల బెడద నుంచి ప్రజలను, పంట పొలాలకు, చిరు వ్యాపారులకు రక్షణ కల్పించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ములుగులో సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. కలెక్టర్ దివాకరకు వినతి పత్రం అందజేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామాల్లో కోతుల బెడద వల్ల ప్రజలు, రైతులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అనానరు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తుమ్మల వెంకటిరెడ్డి, రత్నం రాజేందర్, ఎం.డి.దావూద్, ఎంసీపీఐయూ నాయకులు గుండెబోయిన చంద్రయ్య, కేజీకేఎస్ జిల్లా కార్యదర్శి గుండెబోయిన రవి గౌడ్, ప్రజా సంఘాల జేఏసీ నాయకుడు ముంజాల భిక్షపతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరి

పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి కుమార స్వామి

టేకుమట్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశువైద్య, పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి కుమార స్వామి సూచించారు. మండలంలో కొనసాగుతున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. మూడు నెలల వయసు దాటిన ప్రతి పశువుకూ టీకాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి వివేక్, పశు ఆరోగ్య ఉపకేంద్రం పశుసంపద సహాయకులు దాసరి శంకర్, గోపాల మిత్రలు కుమార్, రాజేందర్, పశుమిత్ర వనిత, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

● కాటారం (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదివారంపేట, పరికిపల్లి, మద్రిపల్లి, ప్రతాపగిరి గ్రామాల పరిధిలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ కోసం ఎఫ్ఎండీ వాక్సినేషన్ చేపట్టారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ రమేష్, డాక్టర్ ధీరజ్ నేతృత్వంలో పశువైద్య సిబ్బంది ఎఫ్ఎండీ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్లు రాజశేఖర్, కిషన్, సుల్తానాబేగం, గోపాలమిత్ర, పశుమిత్రలు శ్రీనివాస్, నజీమా, రైతులు పాల్గొన్నారు.

పంట నష్ట సర్వే చేపట్టిన అధికారులు

మల్హర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన తాడిచర్ల మానేరు పరివాహక ప్రాంతంలోని వరి పొలాల్లో అధికారులు సోమవారం పంట నష్ట సర్వే నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వరదలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతుల పేర్లను నమోదు చేసుకున్నారు. ఎగువన కురిసిన భారీ వర్షాలకు తోడు ఎల్ఎండీ గేట్లు ఎత్తడంతో మానేరు ఉగ్రరూపం దాల్చింది. దీంతో మానేరు పరీవాహక ప్రాంతం మొత్తం వరద పోటెత్తడంతో పంటలు దెబ్బతిన్నాయి. తుఫాన్‌కు పొలాలు నేలవాలిన రైతులను కూడ ఆదుకోవాలని పలువురు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ప్రతాపగిరి యూత్ కాంగ్రెస్ కమిటీ ఎన్నిక

కాటారం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతాపగిరి జీపీ పరిధిలో యూత్ కాంగ్రెస్ కమిటీ ఎన్నిక సోమవారం జరిగింది. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చీటూరి మహేష్‌గౌడ్ సమక్షంలో యూత్ నాయకులు సమావేశమై నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా చింతల ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా గడ్డం పరశురాం, ఉపాధ్యక్షుడిగా పిట్టల రమేష్, కోశాధికారిగా రాజేందర్, కార్యదర్శిగా కండెల సాయికిరణ్, అధికార ప్రతినిధిగా గుంటి రాకేష్, ప్రచార కమిటీ కన్వీనర్‌గా గుంటి రంజిత్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మహేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ తిరుపతి రావు, మాజీ ఎంపీటీసీ రవీందర్‌రావు, సీనియర్ కాంగ్రెస్, యూత్ నాయకులు జక్కుల రాజయ్య, సింగిరెడ్డి మధుకర్, కొండ వెంకటేశ్వర్లు, రమేష్, గుంటి చందు, దయ్యం సమ్మయ్య, తిరుపతి, రమేష్, స్వామి, బాపు, ఐలయ్య, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు నడపాలని డిపో మేనేజర్‌కు వినతి

మహాముత్తారం, నవంబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగారం, బోర్లగూడెం, పెగడపల్లి గ్రామాల మీదుగా ఆర్టీసీ బస్సు నడపాలని కోరుతూ బీజేపీ మండల అధ్యక్షుడు పూర్ణచందర్ ఆధ్వర్యంలో భూపాలపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ అమంచ ఇందుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా మండలంలోని ఇతర గ్రామాలకు బస్సులు నడుపాలని, ప్రతి రోజూ మోడల్ స్కూల్‌కు వచ్చే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో సెల్వరాజ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన సిరికొండ

మొగుళ్లపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపల్లి, మేదరమెట్ల గ్రామాల్లో మాజీ స్పీకర్, శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనచారి సోమవారం పర్యటించారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన చింతలపల్లిలోని కొడిమాల రజిత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా మేదరమెట్ల గ్రామంలో పెంతల ఆగమ్మ చిత్రపటానికి పూలమాలవేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

కాటారం మండలంలో పుట్ట మధు పర్యటన

కాటారం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు సోమవారం పర్యటించారు. పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. కాటారం జీపీ పరిధిలో వివిధ కారణాలతో అడ్డూరి శ్రీకాంత్, తైనేని కిష్టయ్య, మేకల అశోక్, దొంగిరి గట్టయ్య మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బీఆర్ఎస్ నేత అన్వర్‌ను పరామర్శించి ఆరోగ్యం గురించి వాకబు చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి జోడు శ్రీనివాస్, యూత్ మండల అధ్యక్షుడు రామిళ్ల కిరణ్, బీఆర్ఎస్ జిల్లా, మండల నాయకులు జక్కు రాకేష్, తోట జనార్దన్, ఊర వెంకటేశ్వర్‌రావు, కాటారపు రాజమౌళి, వెంకటస్వామి, గాలి సడువలి, జక్కు శ్రావణ్, మానెం రాజబాబు, జాడి శ్రీశైలం, లక్ష్మిచౌదరి, సంతోష్, విక్రమ్, బాలరాజు ఉన్నారు.

సీసీఐ కేంద్రాల్లోనే పత్తిని విక్రయించాలి : ఎమ్మెల్యే గండ్ర

చిట్యాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు పత్తిని విక్రయించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సూచించారు. మండల కేంద్రంలోని శివారులోని శ్రీ బాలమురుగన్ కాటన్ మిల్లులో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కపాస్ కిసాన్ యాప్‌లో రైతు వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. పత్తిని ఆరబెట్టి తేమ లేకుండా తీసుకొచ్చి మద్దతు ధరను పొందాలని అన్నారు, సీసీఐ అధికారులు, మిల్లర్లు రైతులకు సహకరించాలని కోరారు. దళారులను ఉపే క్షించొద్దన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ ఇన్‌చార్జి కార్యదర్శి షరీఫ్, సీసీఐ అధికారి పట్టాభిరామయ్య, మిల్లు యజమాని భాస్కర్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎం.డి.రఫి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, జిల్లా నాయకులు మధు వంశీకృష్ణ, దొడ్డి కిష్టయ్య, రాయకొంరు, పట్టణ అధ్యక్షుడు బుర్ర లక్ష్మణ్, మార్కెట్ డైరెక్టర్లు పాల్గొన్నారు.



సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

వినతులు త్వరిగతిన పరిష్కరించాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహల్ శర్మ

భూపాలపల్లిటౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. ఐడీవోసీ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా 44 మంది వివిధ సమస్య లపై వినతులు సమర్పించగా కలెక్టర్ వాటిని స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ వినతులు పరిశీ లించి వాటిని వెంటనే పరిష్కారం చేసే బాధ్యత తీసుకోవాలని సూచించారు. అవ సరమైతే ఫీల్డ్ విజిట్ చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు అశోక్, విజయలక్ష్మి, ఆర్డీవో రవి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నవీన్‌రెడ్డి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆస్పత్రి సమస్యలపై బీఆర్ఎస్ నేతల వినతి

భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని 100 పడకల ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు కలెక్టర్ రాహుల్‌శర్మకు వినతి పత్రాన్ని అందజేశారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ప్రధానంగా ఇంటర్నెట్ సరిగ్గా పనిచేయకపోవడం వల్ల రక్తపరీక్షలు సకాలంలో జరగడం లేదని తెలిపారు. సీటీ స్కానింగ్ సేవలు త్వరగా ప్రారంభించాలని కోరారు. రూ. కోటితో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంటు వినియోగంలోకి తీసుకురావాలని అన్నారు.

బాధితులు నేరుగా రావాలి : ఎస్పీ

కృష్ణకాలనీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఏదైనా ఆపదొస్తే ఎలాంటి పైరవీలు లేకుండా నేరుగా సంప్రదించాలని ఎస్పీ కిరణ్‌ఖరే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజాదివస్ కార్యక్రమాన్ని నిర్వహించి వివిధ మండలాల నుంచి వచ్చిన 16 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఏలాంటి పైరవీలు లేకుండా మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలన్నారు. చట్టబద్ధ పరిష్కారం ద్వారా ప్రజలకు న్యాయం జరుగుతుందని ఎస్పీ స్పష్టం చేశారు.

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి : ఎంఈవో

వెంకటాపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని ఎంఈవో సత్యనారాయణ అన్నారు. సోమవారం మండల పరిధిలోని చిరుతపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న బాలికలకు మూడో డివిజన్ స్థాయి క్రీడలను నిర్వహించారు. ఈసందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థినులు చదువుతోపాటు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. అనంతరం విద్యార్థినులకు కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించి జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

'సంక్షేమ'ం మిథ్య!

(5వ పేజీ తరువాయి)

విజృంభిస్తున్నాయి. దీంతో విద్యార్థులు జ్వరాల బారిన పడుతున్నారు. దోమలు ప్రబలకుండా కిటికీలకు జాలీలు, మెష్ డోర్లు ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

నామమాత్రంగానే మెనూ...

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సంక్షేమ హాస్టళ్లలో ఒకే రకమైన మెనూను అమలు చేయాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే.. ములుగు జిల్లాలోని పలు హాస్టళ్లలో నిర్దేశించిన మెనూ సక్రమంగా అమలు కావడం లేదని తెలుస్తోంది. ఫలితంగా విద్యార్థులకు పౌష్టికాహారం అందడం లేదనే విమర్శలు వస్తున్నాయి. హాస్టళ్ల పర్యవేక్షణ సక్రమంగా సాగకపోవడంతోనే విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని తల్లిదండ్రులు అంటున్నారు. అలాగే హాస్టళ్లలో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం కాస్మొటిక్ చార్జీలను చెల్లించాల్సి ఉంది. 8 నెలలుగా సక్రమంగా అందక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సబ్బులు, నూనెలు తదితర వస్తువులు సొంత డబ్బులు వెచ్చించి కొనుగోలు చేసుకుంటున్నారు.

ఆయిల్ పామ్ సాగు లక్ష్యాన్ని సాధించాలి

ములుగు టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాన్ని సాధించాలని ఉద్యాన శాఖ జిల్లా అధికారి డి. సంజీవరావు అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం రైతు వేదికలో సోమవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఇప్పటి వరకు 3,233 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ సాగు అయ్యిందన్నారు. ఈఏడాది ప్రభుత్వం 3 వేల ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యం పెట్టుకుందని తెలిపారు. ములుగు, ఇంచర్ల, కాసాందేవి పేట, కొత్తూరు, మంగపేట, రాజుపేట, తిమ్మంపేట, కత్తిగూడెం గ్రామాల్లోని రైతు వేదికల్లో ఆయిల్ పామ్ సాగుపై ఈనెల 7 నుంచి అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

(5వ పేజీ తరువాయి)

వద్ద గ్రామం లోపలికి వెళ్లడానికి రోడ్డు దాటుతుండగా కరీం నగర్‌కు చెందిన కారు కాళేశ్వరం వెళ్లి తిరిగి వస్తూ స్కూటీని ఢీకొంది. స్కూటీ సహా లింగయ్య కిందపడగా సుమారు 20మీటర్ల వరకు కారు ఈడ్చుకెళ్లింది. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో ఉన్న లింగయ్యను భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తర లించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తీసుకెళ్తుండగా లింగయ్య మృతి చెందాడు. మృతుడి కుమారుడు శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్సై తెలిపారు.